నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ బుధవారం 19 జూన్ 2024 | ADILABAD NIRMAL

## వర్చువల్‌లో రిమ్స్ తనిఖీ



ఎదులాపురం, జూన్ 18 : ఢిల్లీ నుంచి ఎన్ఎంసీ(నేషనల్ మెడికల్ కమిషన్) బృందం సభ్యులు మంగళవారం వర్చువల్ విధానంలో ఆదిలాబాద్ రిమ్స్‌ను తనిఖీ చేశారు. డైరెక్టర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన వర్చువల్ సమావేశంలో రిమ్స్‌లో పనిచేస్తున్న డాక్టర్లు పాల్గొన్నారు. రిమ్స్‌కు సంబంధించిన పలు విషయాలపై బృందం సభ్యులు సమీక్షించారు. అందుబాటులో ఉన్న సేవలు, వైద్యసిబ్బంది, బోధనా సిబ్బంది, చికిత్సల కోసం ఉన్న యంత్రాల వివరాలను రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. 125 వైద్య విద్య సీట్లు ఉండగా వచ్చే సంవత్సరం కోసం మరో 50 సీట్లు అదనంగా మంజూరు కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. కొన్ని విభాగాల్లో సిబ్బంది, వైద్యులు తక్కువగా ఉండడంతో ఆ విభాగాల్లో నెల రోజుల్లో నియమించుకోవాలని సూచించారు. త్వరలో మరోసారి వర్చువల్ విధానంలో తనిఖీ చేయనున్నామని తెలిపారు.

## రిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

ఎదులాపురం, జూన్ 18 : రిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మంగళవారం వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన రంజన రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నది. ఆకలి పూర్తిగా మందగించింది. దీంతో ఆమె రెండు వారాల క్రితం రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వచ్చింది. పరీక్షించిన వైద్యులు కడుపులో గడ్డలు ఉన్నాయని నిర్ధారించారు. మంగళవారం సర్జరీ విభాగం హెచ్‌వోడీ శిరీష్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు జక్కుల శ్రీకాంత్, దుర్గా గణేశ్, కార్తీక్, ఆష్ష, శిరీన్‌లు శస్త్రచికిత్స చేసి గడ్డను తొలగించారు. ఈ సందర్భంగా వైద్యబృందం సభ్యులను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అభినందించారు.



తొలగించిన కణితితో రిమ్స్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు



విద్యుత్ కోతలకు నిరసనగా తలమడుగు సబ్ స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్తులు, రైతులు

# కదంతొక్కిన కర్షకులు

- గంటల కొద్దీ విద్యుత్ సరఫరాలో అంతరాయం
- ఫోన్ చేసినా స్పందించని కరెంటోళ్లు
- ముందస్తు సమాచారం లేకుండా కోతలు
- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు బేఖాతరు

## కరెంటు కోతలపై సబ్ స్టేషన్ ముట్టడి

తాంసి, జూన్ 18 : విద్యుత్ కోతలను నిరసిస్తూ ఆదిలాబాద్ జిల్లాలోని తలమడుగు మండలం కేంద్రంలో గల సబ్ స్టేషన్‌ను మంగళవారం స్థానికులు, రైతులు ముట్టడించారు. కొన్ని రోజులుగా అప్రటిత విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ఆగ్రహానికి గురైన జనం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఉదయం 11 గంటలకు 50 మందికిపైగా సబ్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అధికారులు ఎవరూ లేకపోవడంతో అరగంట సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడించిన విషయాన్ని విద్యుత్ సిబ్బంది అధికారులకు సమాచారం అందించారు. గ్రామస్తులు ఏఈ సతీశ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కరెంటు సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. తాంసి మండలంలోని కప్పర్ల గ్రామంలో విద్యుత్ సమస్య అధ్వాన్నంగా మారిందని గ్రామస్తులు సోషల్ మీడియాలో చిట్‌చాట్‌లు చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు మాట్లాడుతూ.. కరెంటు పోతే గంటల కొద్దీ రావడం లేదని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఎప్పుడు వస్తుందో తెలుసుకుందామంటే ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని వాపోయారు. గత ప్రభుత్వం హయాంలో కన్ను మూసి కన్ను తెరిచేలోపు కరెంటు వచ్చేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసిన అధికారులు పట్టించుకోకుండా కరెంటు కోతలు విధిస్తున్నారని విమర్శించారు. ముందస్తు సమాచారం లేకుండా కరెంటు కోతలు విధిస్తుండడంతో అష్టకష్టాలు పడుతున్నామన్నారు. ఈ ఆందోళనలో వీడీసీ అధ్యక్షుడు ఆసం రవి, యువజన సంఘాల సభ్యులు వేణు, అంబేద్కర్ సంఘం నాయకులు అనంద్, చంద్రకాంత్, శ్రీకాంత్, రూపేశ్‌తోపాటు నర్సారెడ్డి, రవి, సాయిగౌడ్, వేణు ఉన్నారు.

### ఎప్పుడు పోతదో.. ఎప్పుడు వస్తదో..



*కేసీఆర్ ప్రభుత్వ పాలనలో కన్ను మూసి కన్ను తెరిచేలోపు కరెంటు వచ్చేది. కాంగ్రెస్ హయాంలో ఎప్పుడు వస్తుందో.. అసలు రాదో తెలియడం లేదు. రాత్రి చేనుకు వెళ్లి కరెంటు పెట్టాల్సిన దుస్థితి వచ్చింది. బీఆర్ఎస్ సర్కారు ఉచితంగా ఇచ్చిన 24 గంటల కరెంటుతో పరేషాన్ లేకుండే. పంటలు పండించడం మస్తు ఇబ్బంది అవుతుంది. అసలు పంటలు వేయాలంటే నష్టం వస్తుందేమోననే భయం వేస్తున్నది.*

**- గవ్వల అశోక్, రైతు, కప్పర్ల, తాంసి మండలం.**

### రూ. 15 వేల నష్టం వచ్చింది..



*నాకున్న మూడెకరాల భూమిలో పత్తి విత్తనాలు విత్తిన. నీటి సౌలత్ ఉందని విత్తుతే.. కరెంటు లేక నీరందక పత్తి మొలకలు మాడిపోయాయి. దీంతో రూ.15 వేల నష్టం వచ్చింది. గిప్పుడు మల్లా గింజలు తెచ్చి విత్తుకుంటే సరైన వర్షాలు పడడం లేదు. కరెంట్ కోతలతో మళ్లీ నష్టపోవుడైతమేదోననే భయం వేస్తున్నది. ఎప్పుడైనా కరెంటు పోయిందని విద్యుత్ సిబ్బందికి ఫోన్ చేస్తే కనీసం స్పందించడం లేదు. ఇలాగైతే ఎలామరీ.*

**- కూకటి దత్తు, రైతు, కప్పర్ల, తాంసి మండలం.**

### వేసవంతా అవస్థలు పడ్డాం..



*రోజంతా పనిచేసి ఇంటికి రాగానే కరెంట్ లేకపోవడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. వేసవికాలమంతా విద్యుత్ కోతలతో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఉచితం పేరిట నాణ్యమైన విద్యుత్ అందించక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వివిధ కారణాలతో రోజుకు 12 గంటల కరెంట్ కూడా అందివ్వడం లేదు.*

**- గొంటిముక్కుల ప్రేమేందర్, తలమడుగు మండలం.**

# బదిలీపై వెళ్తాం.. కొత్తవారొస్తారు

● ధరణి పనులకు బ్రేక్

## పెండింగ్ ధరణి దరఖాస్తులపై చేతులెత్తేసిన అధికారులు

- ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలనే ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న జనం

*"పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా వచ్చిన రెవెన్యూ అధికారులు తిరిగి బదిలీ కోసం ఎదురు చూస్తున్నారు. త్వరలో ట్రాన్స్‌ఫర్స్ ఉంటాయని తెలియడంతో పోస్టింగ్‌ల కోసం పైరవీలు చేస్తున్నారు. ఆ బిజీలో ధరణి అప్లికేషన్లను పట్టించుకోవడం లేదు. కార్యాలయాలకు వెళ్లిన వారికి వారం, పది రోజుల్లో కొత్త అధికారులు వస్తారు. ఇప్పుడు మేం మూమెంట్ చేసినా బదిలీ అయ్యాక అగిపోతది. కొన్ని రోజులు ఆగి కొత్తవారు వచ్చాక చేయించుకుంటే పని అయిపోతది అని చెప్పి పంపిస్తున్నారు."*



**ధరణి పెండింగ్ దరఖాస్తులు**

| | |
|---|---|
| మంచిర్యాల | 6,751 |
| నిర్మల్ | 3,120 |
| ఆసిఫాబాద్ | 957 |

మంచిర్యాల, జూన్ 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రెవెన్యూ కార్యాలయాల్లో పనులకు బ్రేక్ పండింది. రికార్డుల్లో మార్పులు-చేర్పులతో జనం ఇబ్బంది పడకూడదనే సదుద్దేశంతో కేసీఆర్ సర్కారు ధరణి వెబ్‌సైట్‌ను తీసుకొచ్చింది. దీంతో భూమి అమ్ముకోవాలంటే దాని యాజమాని వచ్చి వేలిముద్ర పెడితే తప్పా, వేరే ఎవ్వరికీ ఆ అధికారం ఉండదు. ఈ క్రమంలో చిన్న చిన్న సమస్యలను పరిష్కరించే అధికారం క్షేత్రస్థాయిలో ఎవ్వరికీ ఇవ్వకుండా కలెక్టర్లకు అప్పగించింది. ఫలితంగా పారదర్శకత పెరిగింది. దీంతో కలెక్టర్లు పని ఒత్తిడి, ఇతరాత్ర పనుల్లో బిజీగా ఉండడంతో కొన్నేళ్లుగా వేలాది ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో పడిపోయాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించింది. మార్చి 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు దరఖాస్తులన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు కలెక్టర్లకు ఉన్న అధికారాలను ఆర్డీవో, తహసీల్దార్లకు అప్పగించింది. మ్యూటేషన్, సక్సెషన్, పీవోబీ సమస్యలు, సెమీ అర్బన్ ఏరియాల్లో పట్టాదారు పాస్‌బుక్స్ సమస్యలు, కోర్టు తీర్పులను అనుసరించి పాస్‌బుక్స్ జారీ, ఇండ్లు, నివాస స్థలాలుగా మారిన భూముల నాలా కన్వర్షన్‌ను కలెక్టర్లకు ఉంచి.. మిగిలిన సమస్యల పరిష్కారాన్ని ఆర్డీవోలు, తహసీల్దార్‌లకు అప్పగించింది.

### పరిశీలనకే సరి

కాంగ్రెస్ ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ పేరిట ప్రతి మండలంలో రెండు బృందాలను ఏర్పాటు చేసింది. తహసీల్దార్లు, నయాబ్ తహసీల్దార్లు, గిర్దావర్ల ఆధ్వర్యంలో ఈ బందాలు పని చేశాయి. పది గ్రామాలకు ఒక టీం పంచుకుని పని చేశాయి. కాగా.. మార్చి 1 నుంచి 9వ తేదీ వరకు పెండింగ్ దరఖాస్తుల పరిశీలనకే సమయం సరిపోయింది. దీంతో మార్చి 17వ తేదీ వరకు గడువు పెంచారు. ఈ లోగా లోక్‌సభ ఎన్నికలు రావడంతో రెవెన్యూ అధికారులు ఎన్నికల పనుల్లో బిజీ అయ్యారు. ఈనెల 13న ఎన్నికల కోడ్ ముగియడంతో ప్రభుత్వం తిరిగి ధరణి పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించింది. ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది. రోజుకు కనీసం 100 దరఖాస్తులను పరిష్కరించాలనే టార్గెట్ విధించింది. కానీ.. పనులు ముందుకు సాగడం లేదు. సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆశతో వచ్చిన జనాలు తిరిగి వెళ్లిపోతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కడ చూసినా దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తున్నది.

### మంచిర్యాలలో 6,751అప్లికేషన్స్ పెండింగ్..

స్పెషల్ డ్రైవ్ మొదలైనప్పుడు మంచిర్యాల జిల్లాలో ధరణి పెండింగ్ దరఖాస్తుల సంఖ్య 7,250 ఉండగా.. ప్రస్తుతం 6,751కి వచ్చింది. అంటే నాలుగు నెలల్లో కేవలం 499 దరఖాస్తులను పరిష్కరించారు. ఇక మిగిలిన వాటిని ఈ నెల చివరి వరకు పరిష్కరించడం సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. అధికారులను ఎవ్వరినీ కదిలించినా బదిలీల ప్రస్తావనే తప్పా ధరణి పెండింగ్ అప్లికేషన్ల గురించి మాట్లాడడం లేదు. కలెక్టర్ స్థాయిలో పరిష్కరించాల్సిన పాస్‌బుక్ డేటా కరెక్షన్లు(వెరిఫికేషన్ కోసం) ఆర్డీవో, తహసీల్దార్ల లాగిన్‌లోకి పంపించారు. తహసీల్దార్ల వద్ద 3,601, ఆర్డీవోల వద్ద 66, నాలా కన్వర్షన్‌కు సంబంధించి తహసీల్దార్ల వద్ద 329, ఆర్డీవోల వద్ద 21 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి 697, పెండింగ్ మ్యూటేషన్లు 313, పాస్‌బుక్ లేని సక్సెషన్లు 690, కోర్టు కేసులు 57 మొత్తం కలెక్టర్ లెవల్‌లోనే 1,759 అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఆర్డీవో స్థాయిలో కోర్టు కేసులు, ఇంటిమేషన్ 464, నాలా కన్వర్షన్ 18, ప్రభుత్వం సేకరించిన భూములకు సంబంధించి 87 మొత్తం 576.. తహసీల్దార్ల స్థాయిలో వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 370 అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా నిర్మల్ జిల్లాలో 3,120.. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 957 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ ఈ నెలాఖరులోగా పరిష్కరించడం సాధ్యం కాదని రెవెన్యూ అధికారులే చెప్తున్నారు. బదిలీలు చేశాకే ఈ స్పెషల్ డ్రైవ్‌లు పెట్టుకుంటే మంచిదని అభిప్రాయపడుతున్నారు. ఎంత హడావుడి చేస్తే అన్ని ఇబ్బందులు వస్తాయని, జాగ్రత్తగా చేసుకుంటే ధరణి వెబ్‌సైట్‌లోని సమస్యలన్నీ పరిష్కారమవుతాయని పేర్కొంటున్నారు. ఆ దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తే బాగుంటుందంటున్నారు.

### చాలా రోజులుగా తిరుగుతున్నా..

*నాకు మా నాన్న నుంచి వచ్చిన భూమిలో రెండు గుంటలు పాస్‌బుక్‌లో ఎక్కలేదు. దాని కోసమని దరఖాస్తు పెడితే అధికారులు సర్వే చేయాలన్నారు. దానికి కూడా సిద్ధ పడ్డాం. కానీ.. సర్వే చేసేందుకు ఎవ్వరు రాలేదు. ఎప్పుడు వెళ్లినా వస్తామని చెప్తున్నారు తప్పితే రావడం లేదు. మొన్న కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అడిగితే ఓ 10 రోజులు అయ్యాక చేసుకోండి. కొత్త అధికారులు వస్తారు. ఇప్పుడు మేం మొదలు పెట్టినా బదిలీ అయ్యాక మధ్యలో ఆగిపోతది అని చెప్పారు. సమస్యను పరిష్కరిస్తారని ఆశతో దరఖాస్తు చేసుకుంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా మా సమస్యలను పరిష్కరించాలి.*

**- సాదు వీరభద్రస్వామి, దొనబండ, హాజీపూర్ మండలం.**

## పనులను త్వరగా పూర్తి చేయాలి

### ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



నేరడిగొండలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

నేరడిగొండ, జూన్ 18 : ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. మంగళవారం కొర్టికల్(బి) ప్రాథమిక పాఠశాల, నేరడిగొండ జడ్పీ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలన్నారు. కొర్టికల్(బి) పాఠశాలలో విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం అక్కడ మొక్కను నాటి నీళ్లు పోశారు. అనంతరం నేరడిగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, మూత్రశాలల పనులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతంపై ఆరా తీశారు. అనంతరం మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. ఇక్కడ అపరిశుభ్రత నెలకొనకుండా చూడాలని చెప్పారు. విద్యార్థులకు అందిస్తున్న యూనిఫాం వివరాలను మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వనజను అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులు పూర్తయిన ఇప్పటికీ బిల్లులు రావడం లేదని తేజాపూర్‌కు చెందిన గజ్జల అశోక్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పనులు పూర్తయితే తప్పకుండా బిల్లులు త్వరలోనే వస్తాయని కలెక్టర్ చెప్పారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంఈవో భూమారెడ్డి, ఎంపీవో లక్ష్మణ్, ఆర్‌అండ్‌బీ డీఈ రమేశ్, ఏఈ సంజయ్, డీపీఆర్వో తిరుమల, ప్రధానోపాధ్యాయురాలు పద్మ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వనజ పాల్గొన్నారు.

## కుంటాలకు జలకళ



*తెలంగాణలో ప్రముఖ పర్యాటక ప్రాంతంగా పేరున్న కుంటాల జలపాతానికి జలకళ సంతరించుకున్నది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో వరదనీరు జలపాతంలోకి వచ్చి చేరడంతో నీటితో కళకళలాడుతున్నది. వేసవిలో నీటి ప్రవాహం లేక వట్టిపోయి కళావిహీనంగా ఉన్న జలపాతం.. ఇప్పుడు నీటితో కళకళలాడుతున్నది.*

*- నేరడిగొండ, జూన్ 18*



ఎడ్లబండిలో పనిముట్లు, ఎరువులు, విత్తనాలను తరలిస్తున్న రైతులు

మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న రైతులు, కూలీలు

## రైతన్న బిజీ బిజీ

*మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో సోమవారం సాయంత్రం కురిసిన వర్షాలతో రైతులు విత్తనాలు వేస్తున్నారు. మంగళవారం ఇంద్రవెల్లి మండలకేంద్రంతోపాటు కెస్లాగూడ, ఏమాయికుంట, అంజీ, హర్కాపూర్, దస్నాపూర్, ముత్నూర్, దనోరా(బీ), మెండపల్లి, దేవాపూర్ గ్రామాలకు చెందిన రైతులు పత్తి విత్తనాలతోపాటు మొక్కజొన్న, సోయాబిన్ విత్తనాలు వేస్తూ బిజీగా కనిపించారు. విత్తనాలతోపాటు ఎరువులు ఎడ్లబండ్లతో వ్యవసాయానికి తరలిస్తున్నారు.*

*- ఇంద్రవెల్లి, జూన్ 18*

## పోలీసు జాగిలం తార పదవీ విరమణ

### శాలువావేసి పూలమాలతో సన్మానించిన పోలీసు అధికారులు

ఎదులాపురం, జూన్ 18 : పోలీసు జాగిలం తార అందించిన సేవలు మరువలేనివని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. పన్నెండేండ్లు పోలీసు శాఖకు సేవలు అందించిన జాగిలం తార పదవీ విరమణ పొందిన సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తారకు పూలమాల వేసి శాలువాతో సత్కారించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు జాగిలం జనవరి 22, 2013న జన్మించిందన్నారు. అదే సంవత్సరంలో ఐఐటీ మొయినాబాద్‌లో పేలుడు పదార్థాలను కనుగొనడంలో శిక్షణ పొంది జిల్లాకు వచ్చిందని పేర్కొన్నారు. అప్పటి నుంచి పన్నెండేండ్లపాటు నిర్విరామంగా సేవలు అందిస్తున్నదన్నారు. మందు గుండు సామగ్రి అయిన గన్ పౌడర్, ఆర్డీఎక్స్, సేఫ్టీ ఫీజు, టీఎన్టీ, పీఈకే, కార్డెక్స్ వంటి పేలుడు పదార్థాలను కనుగొనడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సీఐలు నవీన్, చంద్రశేఖర్, మురళి, బాంబు స్క్వాడ్ ఇన్‌చార్జి జె.ప్రేమ్‌సింగ్, డాగ్‌స్క్వాడ్ ఇన్‌చార్జి పి.రమేశ్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



జాగిలం తారను సన్మానిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం